# ప్రజాజ్యోతి



## భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం | 1 | జులై | 2024 | పేజీలు : 5


## ట్రీ మ్యాన్ ఆఫ్ బలరామ్

18 వేల మొక్కలు నాటిన సింగరేణి సిఎండి

ట్రీ మ్యాన్ ఆఫ్ తెలంగాణ అవార్డు ప్రకటించిన గ్రీన్ మ్యాపుల్ ఫౌండేషన్

ప్రకృతి ప్రేమికుని దక్కిన అరుదైన గౌరవం



2లో

# సారే... అక్కడ సర్కార్

- నిత్యం వివాదాలమయమే
- అయినా ఆయనని ఎందుకూ కదపరు
- నిబంధనలను అతిక్రమించి మరి అక్కడ ఎందుకు ఉంచుతున్నారు..?
- జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు అనారోగ్యం

2 లో



■ భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ప్రజాజ్యోతి

ప్రభుత్వ శాఖలో ఏ ఉద్యోగి అయినా తన అర్హతకు తగ్గ ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ ఉంటారు ఇది సహజం. అదేమి చిత్రమో కానీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో మాత్రం ఓ ఉద్యోగి తన అర్హతకు మించి బాధ్యతలు నిర్వర్తిస్తూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని నిత్యం వివాదాల మయంగా మారుస్తూ తానే అక్కడ సర్కార్ అనే రీతిలో వ్యవహరిస్తుండడం సర్వత్ర విమర్శల మయమవుతుంది.





## భద్రాద్రి పవర్ ప్లాంట్‌కు
# పిడుగుదెబ్బ

- సుమారు 25 కోట్ల వరకు ఆస్తి నష్టం..
- ప్రకృతి వైపరీత్యమా.! మానవుని తప్పిదమా.?
- కోట్ల రూపాయల నష్టానికి కారకులేవరు.?
- విచారణ అనంతరం బయటపడనున్న నిజాలు..





**మణుగూరు, జూన్ 30, ప్రజాజ్యోతి**

తెలంగాణ రాష్ట్రానికి విద్యుత్ వెలుగులు అందించాలనే లక్ష్యంతో 2015లో అప్పటి తెలంగాణ ప్రభుత్వం 1080 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా మణుగూరు – పినపాక మండలాల సరిహద్దుల్లో భద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అప్పటి నుండి ఇప్పటి వరకు అనేక వివాదాలతో ప్లాంట్ కొనసాగుతుంది. దీనికి తోడు ప్రస్తుతం ప్లాంట్ కు పిడుగు దెబ్బ పడింది. శనివారం రాత్రి సుమారు 7:30 గంటలకు ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురుస్తుండగా ప్లాంట్ స్విచ్ యార్డ్ ప్రాంతాల్లో పిడుగు పడింది. దీంతో విద్యుత్ కేంద్రంలో భారీగా మంటలు ఎగసిపడ్డాయి. ట్రాన్స్ఫార్మర్ లో ఉండే కరెంట్, ఆయిల్ కారణంగా మంటలు ఉధృతం అవడంతో నియంత్రించేందుకు అధికారులు

మిగతా 2 లో..

# ముగ్గురిని ఢీకొన్న వాహనం

**టేకులపల్లి, జూన్30, ప్రజాజ్యోతి:**



భారత్ జట్టు టి 20 వరల్డ్ క్రికెట్ కప్ గెలిచిన సందర్భంగా సులానగర్ గ్రామంలో రోడ్డు పక్కన సంబరాలు చేసుకుం టున్న యువకులను వేగంగా వచ్చి కారు ఢీకొన్న సంఘటన లో ముగ్గురికి గాయాలైన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. క్రికెట్ వరల్డ్ కప్ లో భారత్ జట్టు విజయం సాధించడంతో సులానగర్ గ్రామం అంబేద్కర్ సెంటర్‌లో యువకులు సంబురాలు చేసుకుంటుండగా ఇల్లందు నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఉండేటి చెన్నయ్య తలకు తీవ్రగాయం అయ్యింది. అలాగే దామర్ల శశాంక్, కోరం. లవకుమార్‌లకు స్వల్పగాయలు అయ్యాయి. వెంటనే వారిని హాస్పిటల్ కి తరలించారు.

# పొలాలకు లిఫ్ట్ ఏర్పాటు చేసి, సాగునీరు అందించండి



**జూలూరుపాడు, జూన్ 30, ప్రజాజ్యోతి:**

మండల పరిధిలోని గుండెపుడి గ్రామానికి చెందిన రైతులు ఆదివారం జల దీక్ష చేపట్టారు. సీతారామ ప్రాజెక్టు నుంచి వచ్చే కాలువ నుండి గుండెపుడి పంచాయతీ రైతులకు లిఫ్ట్ ఏర్పాటు చేయాలని, పంట కాలువలు ఏర్పాటు చేసి తమ భూములకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఎంతో విలువైన పంట భూములను ప్రభుత్వం అడిగిన వెంటనే సీతారామ ప్రాజెక్టు కాలువకు ఇచ్చామన్నారు. గుండెపుడి పంచాయతీ రైతులకు చుక్కనీరు ఇవ్వకుండా, వేరే జిల్లాలకు నీళ్ళను పంపించాలని ప్రభుత్వ అధికారులు ప్రతిపాదనలు చేస్తున్నారని మండిపడ్డారు. రైతు బాధలను ప్రభుత్వం గమనించి గుండెపుడి పంచాయతీ రైతులకు లిఫ్ట్ ఏర్పాటు చేసి, పంట భూములకు నీళ్ళు అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొమ్మినేని కృష్ణమూర్తి, తూముకోటయ్య, గాదె నాగేశ్వరరావు, పొన్నెకంటి వెంకటేశ్వర్లు, గాదె సత్యనారాయణ, వేల్పుల గోపాలకృష్ణ, కంచర్ల శేఖర్, దుద్దుకూరి నరేష్, గాదె కృష్ణయ్య, వలమల సామేలు, దుద్దుకూరు శ్రీను, దొప్పా సత్యనారాయణ, మద్దెబోయిన నరసింహారావు, బాదావత్ రమేష్, నల్లమోతు కృష్ణయ్య, గాదె సురేష్, కళ్యాణపు నరేష్, గోగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వర్షం పడేటప్పుడు కరెంటు స్తంభాలకు దూరంగా ఉండాలి..

# అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దు

## జూలూరుపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి

**జూలూరుపాడు, జూన్ 30, ప్రజాజ్యోతి:**



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరు పాడు పోలీస్ స్టేషన్ సర్కిల్లో ఉన్న జూలూరుపాడు, చంద్రుగుండా, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఒక్క ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈదురుగాలులతో కూడిన వర్షంతో పాటు పలుచోట్ల చెట్లు కొమ్మలు సైతం విరిగిపడ్డాయని, ఈ క్రమంలోనే విద్యుత్ వైర్లు తెగిపడి పలుచోట్ల కరెంటు అంతరాయం ఏర్పడిందని, తడిచిన చేతుల్లో స్విచ్ బోర్డులు ముట్టుకోకూడదని, వాహనదారులు జాగ్రత్తగా ఉండాలని పిడుగులు ప్రమాదం దృశ్య చెట్ల క్రింద ఉండటం గానీ ట్రాన్స్ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు తాకటం చేయద్దు, శిథిలావస్థ లో అవస్థలో ఉన్న భవనాలకు దూరంగా ఉండాలని , అత్యవసర పరిస్థితుల్లో 100 కు కాల్ చేయాలని సూచనలు చేశారు .

# సారే... అక్కడ సర్కార్

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, జూన్30, ప్రజాజ్యోతి:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి ఆరోగ్యశాఖ కార్యాలయాకి అనారోగ్య పరిస్థితులు కల్పిస్తున్నారని బహి రంగంగా చర్చ నడుస్తోంది. అశ్వారావుపేట డిపిఎమ్ఓగా విధులు నిర్వహించాల్సిన సదరు ఉద్యోగి ఉన్నతాధికారుల అండతో అర్హత లేకున్నా జిల్లా కార్యాలయంలో ఏవో గా అందలం ఎక్కి కూర్చోవడం పలువురు ఆ శాఖ అధికారులకే విస్మయం కలిగిస్తుంది.

**ఎయిడ్స్, లెప్రసి సేవలు చూసేదెవరు...?**

సదరు ఉద్యోగి ఏజెన్సీ ప్రాంతమైన అశ్వారావు పేట, గుమ్మడవల్లి, దమ్మపేట, పట్వారిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఎయిడ్స్, లెప్రసీ సేవలు అందించాలి. అందుకుగాను ప్రభుత్వం ప్రత్యేక నిధులను కూడా కేటాయిస్తుంది. మరి సారు ఎలా ఆ నిధులు ఖర్చు చేస్తున్నారో.. వారి సేవలు ఎక్కడ అందుబాటులో ఉంటున్నాయో ఉన్నతాధికారులే సమాధానం చెప్పాల్సి ఉంది.

**అసలు ఆ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పోస్ట్ ఉందా...?**

ఇదంతా ఒక ఎత్తైతే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాల యానికి అడ్మినిస్ట్రేషన్ అధికారిగా విధులు నిర్వర్తిం చడానికి అసలు అక్కడ ఏవో పోస్ట్ లేదనేది కొందరి వాదన అంతేకాకుండా సదరు ఉద్యోగిపై 104 ఉద్యోగులతో సహ ఆనేకమంది ఉద్యోగుల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్న ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విస్మయానికి గురిచేస్తుందని పలువురు వ్యాఖ్యా నిస్తున్నారు. కొత్త కలెక్టర్ సారైనా వైద్య ఆరోగ్య శాఖకు పట్టిన అనారోగ్యాన్ని సరి చేస్తారేమో వేచి చూడాల్సిందే.

# భద్రాద్రి పవర్ ప్లాంట్‌కు పిడుగుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

నానా అవస్థలు పడ్డారు. ఆస్తి నష్టమే తప్ప ప్రాణం నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. ఘటన విషయం తెలుసుకున్న జన్కో థర్మల్ డైరెక్టర్ లక్ష్మయ్య ఆదివారం భద్రాద్రి పవర్ ప్లాంట్ లో పిడుగు పడిన ప్రదేశాన్ని సందర్శించారు. దగ్ధమైన ట్రాన్స్ఫార్మర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రమాదం కారణంగా సుమారు 25 కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగిందని చెప్పుకొచ్చారు. దీని కారణంగా మొదటి యూనిట్ లో 270 మెగావాట్ల ఉత్పత్తికి అంతరాయం కలిగిందని త్వరలో మొదటి యూనిట్ ఉత్పత్తి పునరుద్ధరణకు చర్యలు చేపడతామని వెల్లడించారు.

**ప్రకృతి వైపరీత్యమా..! మానవుని తప్పిదమా..?**

భద్రాద్రి పవర్ ప్లాంట్ పై పిడుగు పడిన సంఘటన సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ప్రకృతి వైపరీత్యాలలో ఒకటైన పిడుగుపాటు వర్షాలు కురిసే సమయంలో పడటం సహజం. అయితే భారీ పరిశ్రమలు, ఈ ఎత్తైన భవనాలు నిర్మాణం చేపట్టేటప్పుడు పిడుగులు పడకుండా ఇంజనీరింగ్ విభాగం అధికారులు మెరుపు కడ్డీలను అమర్చి తద్వారా విద్యుత్ ప్రవాహం (పిడుగు) ను నేరుగా భూమి లోనికి పంపించే ప్రక్రియ ఉంటుంది. అలాంటి రక్షణ పరికరాలను అక్కడ అమర్చారా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. లేకపోతే పిడుగు పడిన ప్రాంతం నిర్మాణం చేపట్టేటప్పుడు గుత్తేదారులు ట్రాన్స్ఫార్మర్ క్రింది భాగంలో అసంపూర్తిగా నిర్మించారా అనే విషయాల పై ప్రజల్లో పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. అంతేకాక ట్రాన్స్ఫార్మర్ లైటింగ్ అరెస్టర్ ఫెయిల్ అయితే కూడా ట్రాన్స్ఫార్మర్ లో మంటలు చెల్లరేగుతాయని అలా కూడా ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని కొందరు నిపుణులు చెప్పుకొస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైంది ప్రకృతి వైపరీత్యాలు జరిగే అవకాశాలు ఉంటాయని ముందస్తుగా సేఫ్టీ విభాగం అధికారులు చర్యలు ఎందుకు తీసుకోలేకపోయారు అనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి.

**25 కోట్ల వరకు ఆస్తి నష్టం సంభవించింది..**

ప్లాంట్ లో పిడుగుపడి సుమారు 25 కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగిందని జెన్కో థర్మల్ డైరెక్టర్ తెలిపారు. త్వరలో మొదటి యూనిట్ ప్రారంభిస్తామన్నారు. కానీ ట్రాన్స్ఫార్మర్ మరమ్మత్తులకు ఎంత సమయం పడుతుందో ఎవరికి తెలియని పరిస్థితి. అవి పని చేస్తాయా ఒకవేళ పనిచేయకపోతే కొత్త వాటిని కొనుగోలు చేస్తారా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే ఆస్తి నష్టం జరిగింది. యూనిట్ ప్రారంభించటానికి ఎటు లేదన్న నెల రోజులు పట్టే అవకాశం ఉందని అధికారులు చెప్పుకొస్తున్నారు. అలా జరిగితే ఒక్క రోజుకు సుమారు కోటి రూపాయలు నష్టం వాటిల్లుతుందని అంచనా అంతేకాక ట్రాన్స్ఫార్మర్ కొత్తది కొనుగోలు చేయాలంటే మరింత ఆర్థిక భారం పడే అవకాశం ఉంది. అయితే గతంలో భద్రాద్రి ప్లాంట్ నిర్మాణానికి ఉపయోగించిన మెటీరియల్ పనికిరాదని ఓ ప్రభుత్వం రిజెక్ట్ చేసింది. దానిని అప్పటి తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు చేసి ప్లాంట్ నిర్మాణానికి ఉపయోగించిందనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అలాంటి నాసిరకపు సామాగ్రిని వాడడం వల్లనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయనే అపవాదులు కూడా లేకపోలేదు. ఏది ఏమైనా ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వానికి ఈ ఘటన తలనొప్పిగా మారింది.

# ట్రీ మ్యాన్ ఆఫ్ బలరామ్

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, జూన్ 30, ప్రజాజ్యోతి**

సింగరేణి సంస్థను పర్యావరణ హిత సంస్థగా మార్చడమే కాకుండా అందరిలోనూ పర్యావరణ స్ఫూర్తిని పెంచేందుకు తానే స్వయంగా 18 వేలకు పైగా మొక్కలు నాటి, తెలంగాణలోని 6 జిల్లాల్లో 35 చిన్న అడవులను (మినీ ఫారెస్ట్) సృష్టించినందుకు గుర్తింపుగా సింగరేణి సంస్థ ఛైర్మన్ ఎండీ ఎన్.బలరామ్ కు గ్రీన్ మ్యాపుల్ ఫౌండేషన్ వారు "ట్రీ మాన్ ఆఫ్ తెలంగాణ "అనే ప్రతిష్టాత్మక అవార్డును ప్రదానం చేశారు. శనివారం రాత్రి హైదరాబాద్ లో నిర్వహించిన గ్రీన్ మ్యాపుల్ ఫౌండేషన్ -2024 అవార్డుల ప్రదానోత్సవంలో ఆ సంస్థ ఎండీ అశుతోష్ వర్మ, ఎన్టీపీసీ, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ఉన్నతాధికారులు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ కు ఈ అవార్డును అందజేశారు. దేశంలో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న ప్రభుత్వ రంగ, ప్రైవేట్ రంగ దిగ్గజ కంపెనీలు, అందులోని ప్రభావశీల వ్యక్తులకు గ్రీన్ మ్యాపుల్ వారు ప్రతి ఏడాది ఇటువంటి ప్రోత్సాహక అవార్డులు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎన్.బలరామ్ ఇప్పటికే స్వయంగా 18వేలకు పైగా మొక్కలు నాటారని, సింగరేణి సంస్థ కూడా ఆరు కోట్లకు పైగా మొక్కలు నాటి పర్యావరణానికి మేలు చేస్తున్న సంస్థల్లో అగ్రగామి గా నిలిచిందని పేర్కొన్నారు. సివిల్ సర్వీసెస్ అధికారిగా ఉన్నత స్థాయిలో తీరిక లేకుండా ఉన్నప్పటికీ పర్యావరణ పరిరక్షణ కోసం ఒక్కడే 18 వేల మొక్కలు నాటి 6 జిల్లాల్లో 35 చిన్న అడవులుగా (మినీ ఫారెస్ట్) సృష్టించడం దేశంలోనే అత్యంత అరుదని కొనియాడారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎన్.బలరామ్ మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి చేస్తున్న తమ సంస్థ నిబంధనల ప్రకారం పచ్చ దనాన్ని కాపాడడంతో పాటు స్వచ్ఛందంగా కూడా పర్యావరణ పరిరక్షణకు అనేక కార్యక్రమాలు చేపడుతోందని, సింగరేణి వ్యాప్తంగా 6 కోట్లకు పైగా మొక్కలు నాటినట్లు చెప్పారు. సింగరేణి సంస్థ చేస్తున్న పర్యావరణ హిత చర్యలకు గుర్తింపుగా 2021-22వ సంవత్సరంలో కార్బన్ న్యూట్రాలిటీ కంపెనీగా సీఎం పి డి ఐ గుర్తించిందని పేర్కొన్నారు. ప్రతీ అడుగు పచ్చదనం అన్న నినాదంతో సింగరేణిలో మొక్కలు నాటే యజ్ఞాన్ని కొనసాగి స్తున్నట్లు తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా ఎక్కడ ఖాళీ స్థలం కనిపించినా మొక్కలు నాటాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది వన మహోత్సవంలో మరో 2 వేల మొక్కలు నాటాలని వ్యక్తిగత లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు వివరించారు. దీంతో 20 వేల మొక్కలు నాటినట్లు అవుతుం దన్నారు. కంపెనీలో ఈ ఏడాది 40 లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. అలాగే పిల్లల్లో చిన్నతనం నుంచే పర్యావరణ స్ఫూర్తిని పెంచేం దుకు వీలుగా సింగరేణి పాఠశాలల్లో పర్యావరణ సిలబస్ను బోధిస్తున్నామని.. ప్రతీ క్లాస్ లోనూ గ్రీన్ కెప్టెన్లను నియమించి పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందిస్తున్నట్లు చెప్పా రు. తనకు అవార్డును ప్రకటించిన నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపిన ఆయన ఈ అవార్డు సింగరేణి లోని పర్యావరణహితులందరికీ చెందుతుం దన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని పర్యావరణహిత కార్యక్రమాలు కొనసాగించ నున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ, ఆయిల్ ఇండియా తదితర కంపెనీల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## పాల్వంచ సిఐ వినయ్ కుమార్

**ములకలపల్లి, జూన్ 30, ప్రజా జ్యోతి**

వర్షాల దృష్ట్యా మండలంలో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. మండలం లోని ములకలపల్లి నుంచి మంగలలిగుట్ట వెళ్లే రహదారి మధ్య పాములేరు వాగు, జగన్నాధపురం నుంచి రాచన్నగూడెం వెళ్లే రహదారి లో ముత్యాలంపాడు వద్ద వాగులపై వంతెన నిర్మాణపనులు జరుగుతున్నాయి. హైలెవల్ వంతెన నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండటంతో ఆ గ్రామాలకు వెళ్లేందుకు సేడ్ డైవర్సన్ ఏర్పటు చేశారు. శనివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు తాళ్ళపాయ సేడ్ డైవర్షన్ దారి కోతకు గురైంది. దింతో అప్రమత్తమైన అధికా రులు శనివారం స్థానిక తహశీల్దార్ జి పుల్లారావు, సిఐ వినయ్ కుమార్, ఎస్సై రాజమౌళి ఆర్ఐ తారాచంద్ లతో కలసి ఆదివారం రింగిరెడ్డిపల్లి, ముత్యాలం పాడు వద్ద వాగును సందర్శించారు. ఈ సందర్భంగా సిఐ వినయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజల రాక పోకలకు అంతరాయం లేకుండా వాగులు ఉధృతి సమయంలో ప్రజలు వాగులు



దాటకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలసి పని చేసేలా చూడాలని ఎస్సై రాజమౌళికి సూచించారు. ఎట్టిపరిస్థితుల్లో వాగులు ఉధృతిగా ప్రవహించే సమయంలో రాకపోకలు పూర్తిగా నిలిపి వేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు పర్యవేక్షణ చెయాలన్నారు. వంతెన నిర్మాణ గుత్తేదారులు, సంబంధిత అధికారులతో మాట్లాడి వరద నీరు వెళ్లేందుకు అప్రోచ్ రోడ్డులో ఎక్కువ నీరు వెళ్ళేవిధంగా అదనపు తురలు వేయించాలని సూచించారు.

# వైద్య సిబ్బంది నియామకం పట్ల నిర్లక్ష్యమేలా...?

- కార్మికుల ఆరోగ్యమంటే అంత అలుసా..?
- అంబులెన్స్ అందుబాటులో సరే...!
- సిబ్బంది కొరత తీర్చేదెవరూ...?
- 24 గంటలు డిస్పెన్సరీలో అంబులెన్స్ ఉండడం సబబే..
- వేధిస్తున్న సిబ్బంది నియామకాలు..
- ఒక సిస్టర్ తోనే సరిపెడుతున్న వైనం..?
- చీకటి పడితే ఇబ్బందులు తప్పవా...!
- ఇద్దరు సిస్టర్స్, ఒక వార్డు బాయ్ అవసరం..
- నిత్యం వైద్య సేవలు అందిస్తున్న ఒక్క వైద్యుడు..!
- నియామాలు త్వరితగతిన చేపట్టరూ...




**ఇల్లందు, జూన్ 30, ప్రజాజ్యోతి:**

సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న కార్మికుల ఆరోగ్యం పట్ల పుట్టినిల్లయిన ఇల్లందు అధికారులకు ఎందుకంత నిర్లక్ష్యమో అర్థం కాని పరిస్థితి. సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాలతో పాటు కొన్ని డెస్పెన్సరీ లను ఏర్పాటు చేసి ఎల్లవేళలా వైద్య సేవలు అందించడం జరుగుతుంది. కానీ ఇల్లందు ఏరియాలోని టేకులపల్లి డెస్పెన్సరీలో 24 గంటలు అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని సూచించినట్లు తెలుస్తుంది. కేవలం అంబులెన్స్ ఒకటే అందుబాటులో ఉంటే సరిపోదని సిబ్బంది కొరత లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని కార్మికులు పేర్కొంటున్నారు. టేకులపల్లి డిస్పెన్సరీలో సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమిస్తేనే 24 గంటలు వైద్య సేవలు అందించడం జరుగుతుందనేది వాస్తవం. టేకులపల్లి డిస్పెన్సరీలో సిబ్బంది కొరతపై ఇల్లందు వైద్యశాల డివై సియంఓ పలుమార్లు లేటర్లు పెట్టినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు లేకపోలేదు. టేకులపల్లి డిస్పెన్సరీలో ఒక వైద్యుడు, సిస్టర్, వార్డు బాయ్, అంబులెన్స్ డ్రైవర్, స్కావెంజర్ విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం విధులకు హాజరవుతున్న సిస్టర్ సాయంత్రం వెళ్ళిపోవడం జరుగుతుంది. రాత్రి సమయాల్లో కార్మికులకు ఏమైనా ఆరోగ్య సమస్యలు వస్తే సిస్టర్ లేకపోతే ఇబ్బంది కలిగించే విషయమనే చెప్పొచ్చు. అంబులెన్స్ 24 గంటలు అందుబాటులో ఉంచిన కానీ సిస్టర్ తో పాటు వార్డ్ బాయ్ లేకపోవడంతో అంబులెన్స్ డ్రైవర్ అన్ని పనులు చేసుకోవడం సాధ్యమవుతుందా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. డిస్పెన్సరీ లో వసతి ఉండడంవల్ల ఒక వైద్యుడే నిత్యం అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించడం జరుగుతుందని సమాచారం. ఇప్పటికైనా ఇల్లందు ఉన్నతాధికారులు స్పందించి ఇల్లందు డివై సియంఓ వినతులను పరిగణలోకి తీసుకొని టేకులపల్లి డిస్పెన్సరీ లో ఇద్దరు సిస్టర్లు, ఒక వార్డు బాయ్ ను నియమించి 24 గంటలు సింగరేణి కార్మికులకు వైద్య సేవలు అందించేలా చూడాలని పలువురు కార్మికులు కోరుతున్నారు.

**సిబ్బందిని నియమించి వైద్యసేవలు అందించాలి...**

**భూక్యా నాగేశ్వరరావు, ఐఎన్టియూసి బ్రాంచ్ కార్యదర్శి, ఇల్లందు**

సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా లోని టేకులపల్లి డిస్పెన్సరీలో సిబ్బంది కొరత లేకుండా చూడాలి.



త్వరితగతిన సిబ్బందిని నియమించి 24 గంటలు వైద్యసేవలు అందించాలి. సంస్థ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న కార్మికుల పట్ల అధికారులు శ్రద్ధ వహించాలి. టేకులపల్లి డిస్పెన్సరీలో ఎల్లవేళలా సిబ్బంది అందుబాటులో ఉండి కార్మికులకు వైద్యం అందించాలి.

## పుస్తకాల పేరుతో నిలువుదోపిడీ చేస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలు

### అధిక ఫీజులు పట్టించుకోని విద్యాశాఖాధికారులు

### సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్

**మణుగూరు, జూన్ 30, ప్రజాజ్యోతి**



పుస్తకాల పేరుతో ప్రైవేటు విద్యాసంస్థలు అధిక డబ్బులు, స్కూల్ ఫీజులు వసూలు చేస్తున్నారని, దీనిని వెంటనే విద్యాశాఖ అధికారులు నియంత్రణ చేయాలని లేకుంటే ఆందోళన తప్పదని సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్ హెచ్చరించారు. మణుగూరు డివిజన్ లో విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే ప్రైవేట్ విద్యాసంస్థలు పాఠ్య పుస్తకాలను కూడా అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని, కొన్ని స్కూల్లోనే పుస్తకాలు అమ్ముతున్నరని, ప్రైవేట్ స్కూల్స్, మార్కెట్లలో బుక్ స్టాల్స్ ద్వారా అమ్మకాలు కొనసాగిస్తూ వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఒకవైపు ప్రైవేట్ స్కూళ్లలో అధిక ఫీజులు కట్టలేక సామాన్య మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే దీనికి తోడు పుస్తకాల పేరుతో ఎల్ కేజీ పుస్తకాలు 3000 రూపాయలు, మూడో తరగతి పుస్తకాలు 5,000 రూపాయలు ఇలా అధిక డబ్బులు వసూలు చేస్తూ, సామాన్య, మధ్యతరగతి పేద విద్యార్థులను ఇబ్బందుల గురిచేస్తుందని, రిక్షా కార్మికుడు, ఆటో నడుపుకునే వ్యక్తి, కూరగాయలు అమ్ముకునే వ్యక్తి, చేతివృత్తుల వారు ఇలా ఇబ్బందులు పడుతున్న సంబంధిత విద్యాశాఖ మాత్రం ఏమాత్రం పట్టించుకోవడంలేదని, పత్రికలలో వచ్చినా పట్టింపు లేదని, కేవలం మాకు ఫిర్యాదు వస్తేనే మేము విచారణ చేస్తామంటూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. . సంబంధిత శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి పుస్తకాల అమ్మే షాపుల పైన చర్యలు తీసుకొని అధిక డబ్బులు తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రత్యక్ష ఆందోళన తప్పదని హెచ్చరించారు.

## ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగికి సన్మానం



**ఇల్లందు, జూన్ 30, ప్రజాజ్యోతి:**

సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా జెకె5 ఓసిలో ఈపి ఎలక్ట్రీషియన్ గా విధులు నిర్వహిస్తూ ఆదివారం ఉద్యోగ విరమణ పొందుతున్న యం. సదానందంను ప్రాజెక్ట్ ఆఫీసర్ బొల్లం వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించారు. ఉద్యోగ విరమణ అనంతరం రావాల్సిన బెనిఫిట్స్ గ్రాట్యూవిటి, సీఎంపిఎఫ్, పెన్షన్ ఆర్డర్, ఎఫ్బిఐఎస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదానందం సింగరేణి సంస్థలో వివిధ హోదాలల్లో పని చేశారని, వారు చేసిన సేవలు మరువలేనివని, అంకిత భావంతో పనిచేసి అందరిమన్ననలను పొందారని కొనియాడారు. వారి శేష జీవితం సుఖమయంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ పూర్ణచందర్, సేఫ్టీ ఆఫీసర్ శివప్రసాద్, ఇంజనీర్ చిన్నయ్య, ఏరియా పిట్ కార్యదర్శి సంజీవ చారి, నవీన్ కుమార్ ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## రోడ్డు వేశారు.. కరెంటు స్తంభాలు మరిచారు





**ఆళ్ళపల్లి, జూన్ 30, ప్రజాజ్యోతి:**

ఆళ్ళపల్లి మండల పరిధిలోని గత డిసెంబర్ నెలలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద సిసి రోడ్లు మంజూరయ్యాయి. సీసీ రోడ్లు వేసేటప్పుడు అధికారుల నిర్లక్ష్యంతో నడిరోడ్డుపై ఉన్న కరెంటు స్తంభాలు తొలగించకుండానే మండలం నడిమిగూడెం గ్రామం రోడ్లు వేయడం జరిగింది. మర్కోడు పంచాయతీలోని ఎస్సీ కాలనీలో ముత్యాలమ్మ గుడి దగ్గర కరెంటు స్తంభాలు నడిరోడ్డు మధ్యలో ఉన్నప్పటికీ అధికారులు సర్వే నిర్వహించి పంచాయతీ అధికారులకు మరియు విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేసి స్తంభాలను తొలగించి రోడ్డు వేయాల్సి ఉండగా, వాటిని అలాగే వదిలేసి రోడ్లు వేశారు. దీంతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డుపై ద్విచక్ర వాహనాలు తప్ప కారు, ఆటోలు తిరిగే అవకాశం లేకుండా పోయిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దీనిపై తగుచర్య తీసుకోవాలని కోరుతున్నారు.

## హ్యాట్సాఫ్ టీం ఇండియా

### ప్రపంచకప్ విజేత భారత జట్టుకు వెంకటేష్ రెడ్డి అభినందనలు

**బూర్గంపహాడ్, జూన్ 30, ప్రజాజ్యోతి**



టీ ట్వంటీ క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్లో దక్షిణాఫ్రికా పై భారత జట్టు ఘన విజయం సాధించడం పట్ల బూర్గంపహాడ్ మండలం నాయకులు మాజీ సొసైటీ చైర్మన్ పోతి రెడ్డి వెంకటేష్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. 17 ఏళ్ల నిరీక్షణ తరువాత టీ ట్వంటీ వరల్డ్ కప్ లో భారత్ విజయం తనకు సంతోషాన్ని కలిగించిందని తెలిపారు. ఈ సందర్భంగా కెప్టెన్ రోహిత్ బృందానికి అభినందనలు తెలిపారు. టీం ఇండియా ప్రపంచ కప్ గెలవడం పట్ల దేశ ప్రజలకు , క్రికెట్ అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయం రేపటి భవిష్యత్ క్రీడాకారులను మరింత ప్రోత్సహించడానికి ఉపయోగపడుతుందని ఆకాంక్షించారు.

## శకుంతల సేవలు అభినందనీయం

**టేకులపల్లి, జూన్ 30, ప్రజాజ్యోతి:**



ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సులానగర్ లో హెల్త్ సూపర్వైజర్ గా పని చేస్తున్న వీసం శకుంతల సేవలు అభినందనీయమని మండల వైద్యాధికారి డా. కందుల దినేష్ పేర్కొన్నారు. ఆదివారం విసం శంకుతల ఉద్యోగ విరమణను పురస్కరించుకొని ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం చేయాలంటే మహిళలు భయపడే రోజుల్లో అందులో గిరిజన కుటుంబం నుంచి వచ్చి 34 సంవత్సరాలకు పైగా వైద్య ఆరోగ్య శాఖలో పనిచేశారని కొనియాడారు. రహదారులు సరిగ్గా లేని సమయంలో మారుమూల ప్రాంతాలలో గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చే వైద్య సేవలు అంకితభావంతో ప్రజలకు అందించడంలో వీసం శకుంతల కృషి మరిచి పోలేనివని తెలిపారు. ఇప్పటికీ ప్రజలు ఆమెకు ఇస్తున్న గౌరవమే దీనికి నిదర్శనమని, అందులో ఆమెకు ఉన్న ఓర్పు, సహనం ఇతరులకు ఎంతో ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లు వజ్జా పార్వతి, సీతమ్మ, భద్రమ్మ, సత్యవతి, ఆరోగ్య విస్తరణాధికారి దేవా, ఇల్లందు సబ్ యూనిట్ అధికారి హరికృష్ణ, పబ్లిక్ హెల్త్ నర్సులు చంద్రకళ, దయామణి, తెరోజా, సూపర్వైజర్లు పోరండ్ల శ్రీనివాస్, గుజ్జా విజయ, కృష్ణ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పాత పెన్షన్ పద్ధతి కావాలని హెచ్ఎం దీక్ష



**అశ్వాపల్లి, జూన్ 30, ప్రజాజ్యోతి:** ఎలక్షన్స్ లో ఎస్ జి టి లకు ఓటు హక్కు సాధనకై 108 రోజుల ఫలహార దీక్ష: జాకారం హెచ్ఎం షేక్ మహమూద్ పాషా. తెలంగాణ లోని ఉద్యోగ, ఉపాధ్యాయు లంద రికీ ఓల్డ్ పెన్షన్ స్కీమ్ వర్తింప జేయాలని ఎస్జిటిలకు టీచర్ ఎమ్మెల్సీ ఎలక్షన్స్ లో ఓటు హక్కు ఇవ్వాలని వీటిని సాధించడం కోసం 108 రోజులపాటు ఫలహార దీక్ష చేస్తున్నట్లుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. అశ్వాపల్లి మండలం ,మర్కోడు. పరిధిలోని ఎంపీపీ ఎస్ జాకారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మహమూద్ పాషా తెలియజేశారు. గతంలో ఫిబ్రవరి 13 2024 నుంచి మార్చి 4 2024 వరకు ఓల్డ్ పెన్షన్ స్కీం కోసం 21 రోజుల పాటు ఒంటి పూట ఆహారం స్వీకరిస్తూ దీక్ష చేసినట్లుగా వారు గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడం వల్ల ఈసారి 108 రోజుల ఫలహారదీక్ష చేస్తున్నట్లుగా వారు తెలిపారు. ఈ ఫలహార దీక్ష జూలై 1 ,2024 నుంచి అక్టోబర్ 16 ,2024 వరకు జరుగుతుందని తెలిపారు. ఈ 108 రోజుల ఫలహార దీక్షల్లో మొదటి 25 రోజులు ఒకపూట ఫలహారం, తర్వాత 25 రోజులు రెండు పూటల ఫలహారం, మిగిలిన 58 రోజులు మూడు పూటలా కేవలం ఫలాలను మాత్రమే ఆహారంగా స్వీకరిస్తూ దీక్ష కొనసాగిస్తున్నట్లుగా వారు తెలిపారు. ఈ దీక్ష ద్వారా ప్రభుత్వంలో స్పందన వస్తుందని ఆశిస్తూ తద్వారా ఉద్యోగ ఉపాధ్యాయులకు మేలు జరగాలని కోరుకుంటున్నట్లుగా వారు తెలిపారు. ఎమ్మెల్సీ ఎలక్షన్స్ లో ఎస్ జి టి లకు ఓటు హక్కు టీచర్లకు లేకపోవడం వల్లనే, ఇటు ప్రభుత్వం కానీ, సంఘాలు కానీ వారిని పట్టించుకునే పరిస్థితి లేదని, ఆత్మగౌరవం విషయంలో చాలా కృంగుబాటుకు లోనవుతున్నారని వారు తెలిపారు. ప్రభుత్వం కూడా ఓటు హక్కు ఉన్న ఉపాధ్యాయులకు మాత్రమే అన్ని రకాలుగా అనుకూలంగా వ్యవహరిస్తున్నారని వారు తెలిపారు. ఎస్జీటీలు రాను రాను అనేక విషయాలలో సంఘాలు కానీ, అటు ప్రభుత్వం కానీ చాలా అణగారిన తనంగా చూస్తున్నారని, ఎస్జీటీల ఆత్మగౌరవం కోసం, వారి కి టీచర్ ఎమ్మెల్సీ ఎలక్షన్స్ లో ఓటు హక్కు కల్పించాలని ఒక ఎస్జీటీగా తాను ఈ దీక్ష చేస్తున్నట్లుగా వారు తెలిపారు.

## తెలంగాణ తొలిదశ ఉద్యమకారులను సన్మానం



**కొత్తగూడెం, జూన్ 30,ప్రజాజ్యోతి:** 1969లో తెలంగాణ తొలి ఉద్యమానికి బీజం వేసి ఉద్యమాన్ని పెద్ద ఎత్తున నడిపిన ఆనాటి తెలంగాణ తొలిదశ ఉద్యమకారులను ఉర్దూ ఘర్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనారిటీ నాయకులు నయీమ్ ఖురేషి ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నయీమ్ ఖురేషి మాట్లాడుతూ దేశానికి స్వతంత్రం 1947లో వచ్చినప్పటికీ మన తెలంగాణకు నిజాం సర్కార్ నుంచి విముక్తి 17 సెప్టెంబర్ 1948 లో రావడం జరిగిందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత తెలంగాణ చాలా నష్టపోవటం జరిగిందన్నారు. 1968 జులై 1 నాడు కేటీపీస్ పాల్వంచలో టిఆర్పి ద్వార 1400 ఉద్యోగాలున్నప్పటికి తెలంగాణ వాళ్లకు కేవలం 200 ఉద్యోగాలు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తు కృష్ణ కేటీపీస్ సాధారణ కార్మికుడు నిరాహార దీక్ష ద్వార ఉద్యమం నిర్వహించాన్నారు. తొలత ఉద్యోగులు, విద్యార్థులు, మేధావులు, రాజకీయ నాయకులు ఉద్యమం కొనసాగించి నప్పటికీ 2012 సకల జనుల సమ్మె ద్వార మన తెలంగాణ పోరాడి సాధించుక్నమ్మన్నారు. కానీ ఉద్యమకారుల కోసం గత ప్రభుత్వం ఏది చేయలేదన్నారు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఫించన్ 25 వేలు, ఇల్లు లేని వారికి ఇంటి స్థలము, ఆరోగ్యశ్రీ కార్డు, ఫ్రీ బస్సు పాస్, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉర్దూఘర్ కార్యదర్శి మహమ్మద్ షరీఫ్, కోశాధికారి జావీద్ సతె, సీనియర్ కాంగ్రెస్ మైనారిటీ టౌన్ ప్రెసిడెంట్ మొహమ్మద్ జానీ పాషా, ఏఎస్ జె మాజీ అధ్యక్షులు అమీర్ ఖాద్రి, బాబు జానీ, దుమ్ముడి నాగేశ్వర్ రావు, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

# దౌర్జన్యంగా భూమిలోనికి అక్రమంగా ప్రవేశించి బెదిరింపులు

**జెండాలు పాతేందుకు యత్నం..**

**అడ్డుకున్న వారిపై దాడి..**

**గతంలోనూ బెదిరించి రూ.50వేల వసూలు..**

**బాధితుల ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు..**

**కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలింపు..**



**కొత్తగూడెం, జూన్ 30, ప్రజాజ్యోతి:** . ఇతరుల భూమి లోనికి అక్రమంగా ప్రవేశించి బెదిరింపులు.. దౌర్జన్యానికి దిగడమే కాకుండా భూమిలో జెండా లు పాతేందుకు యత్నించి అడ్డుకున్న వారిపై సైతం దాడికి పాల్పడిన కొందరు వ్యక్తులపై కేసు నమోదు అయ్యింది. ఇందుకు సంబంధించిన బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూలూరుపాడు మండలం గోపాతండా పంచాయతీ పరిధిలోని మాచినపేటకు చెందిన బోడ వీరన్న, భూక్య రామకృష్ణ కలిసి దండమూడి రవీంద్ర అనే వ్యక్తి వద్ద రామాంజనేయ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, చుంచుపల్లి మండలం పరిధిలో గల సర్వే నెంబర్ 137/2అ/1/2, సర్వేనెంబర్ 137/2అ/2, 137/20/1/3లలో 10 ఎకరాల భూమినిఇ ఏడు కోట్లకు బేరం చేసి ది.25.10.2023న అడ్వాన్స్ గా రూ.20 లక్షలు ఇచ్చారు. అనంతరం ఆ భూమిని డెవలప్ చేయుటకు కన్వర్షన్ పొందారు. సుమారు వారం రోజుల క్రితం లావుడియా ప్రసాద్, కొమరం బుచ్చయ్యతో పాటు మరి కొంత మంది వచ్చి మీరు భూమి కొన్నారు కానీ ఇది మొత్తం 1/70 యాక్ట్ లో ఉన్నదని, ఇది ప్రభుత్వ భూమి అని, తాము గతంలో ఇక్కడ 200 మందితో గుడిసెలు వేయించినామని, తమకు, సహకరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షం లో భూమిలో రాత్రికి రాత్రే గుడిశలు వేయిస్తామని బెదిరించారని బాధితులు తెలిపారు. గతంలో కొమరం బుచ్చయ్య మమ్మల్ని బెదిరించి మా వద్ద 50,000లు తీసుకున్నాడని తెలిపారు. మరలా తిరిగి ఈ నెల 28న మధ్యాహ్నం సుమారు 12 గంటలకు తమ భూమిలోనికి ట్రాలీ ఆటో, ఆటో, మోటార్ సైకిల్లు పై వచ్చిన లావుడియా ప్రసాద్, కొమరం బుచ్చయ్య, నూనావత్ రాంబాబు, బద శ్రీనివాస్, బట్టు రాంజీ సంపత్, మరి కొంతమంది అక్రమంగా సమావేశమై తమ భూమి లోనికి ప్రవేశించి భూమిలో గుంతలు తవ్వి నష్టం కలిగించారు. దీని విలువ సుమారు 25,000లు నష్టం వాటిల్లింది. జెండాలు పాతుతామని దౌర్జన్యం చేస్తూ మీకు భూమి ఇక్కడ ఎక్కడిది రా అని బూతులు తిడుతూ చేతులతో బోడ వీరన్నను, భూక్య రామకృష్ణపై దాడికి పాల్పడ్డారు. బాధితుడు బోడ వీరన్న ఫిర్యాదు మేరకు చుంచుపల్లి పోలీసులు లావుడియా ప్రసాద్, కొమరం బుచ్చయ్య, నూనావత్ రాంబాబు, పాటు మరి కొంతమందిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్ చేశారు. కాగా వీరి వెనుక పెద్దల హస్తం కూడా ఉందన్న చర్చ జోరుగా సాగుతోంది.

# ఖరీఫ్ సాగు రైతు సమస్యలు పరిష్కరించండి: కెచ్చెల రంగారెడ్డి



**భద్రాచలం, జూన్ 30, ప్రజాజ్యోతి:** మహాసముద్రాల ఉపరితల ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పులన్నీ సానుకూలంగా వుండటంతో ఈ ఏడాది నైరుతి రుతుపవనాలతో సాధారణ వర్షపాతం నమోదవుతుందన్న వాతావరణ నిపుణుల ప్రకటనతో, జూన్ ఒకటి లేదా రెండవ వారంలో రుతుపవనాలు విస్తరించి వర్షాలు కురుస్తాయన్న ప్రకటనతో ఇప్పటికే రాష్ట్ర రైతాంగం ఖరీఫ్ సాగు ప్రారంభపనులు మొదలు పెట్టారు. "తొలకరి వస్తుందంటేనే రైతాంగానికి అపార సంబరం, ఖరీఫ్ విరగపండి తమను గట్టెక్కిస్తుందని, వరుణుడు కరుణిస్తే చాలు అంతా సవ్యంగా సాగిపోతుందన్న నమ్మకమే సాగుదారుల్ని ఎప్పటికప్పుడు ఎంతటి శ్రమకైనా సంసిద్ధపరుపోకింది. గత ఏడాది కంటే ఈ సం?రం అధిక వం–పాతం వుంటుందని భారత వాతావరణ శాఖ నేల క్రితమే చల్లని కబురు చెప్పింది. తాజాగా దక్షిణ అండమాన్, నికోబార్ దీవుల్ని తాకిన నైరుతి రుతుపవనాలు ముందుగానే వర్షాగమనం తధ్యమని సూచిస్తున్నాయి. అందుకు తగ్గట్టు ఖరీఫ్ సన్నాహక చర్యలు ఊపందుకున్నాయా అంటే లేదన్నదే నిష్టూర సమాధానం..." రాష్ట్రంలో ఈ ఖరీఫ్ సాగు సీజన్లో 1,60 కోట్ల ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగవుతాయని,ఇందులో వరి 65 లక్షల ఎకరాలు, పత్తి 60.53 లక్షల ఎకరాల్లో మరింత పంటలు సాగవుతాయని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రకటించింది. వీటికి వరి విత్తనాలు 16.50 లక్షల క్వింటాళ్లు, పత్తి విత్తనాలు 54 వేల క్వింటాళ్లు, మొక్కజొన్నలు 48 వేల క్వింటాళ్లు అవసరం అవుతాయని అంచనా వున్నది. అవసరానికి తగ్గట్టుగా విత్తనాలు సరిగా లభించటం లేదని రైతాంగం కరీంనగర్, ఆదిలాబాదు జిల్లాల్లో రైతాంగం ఇప్పటికే రోడ్డెక్కారు. దీనిని బట్టి సమస్య వుందని చెప్పకనే చెప్పినట్లుంది. కానీ, రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాత్రం అదేమీ లేదని మే 23న రాష్ట్రంలో 56 లక్షల పత్తి విత్తన పాకెట్లు అందుబాటులో వుంచగా, 7.22 లక్షల పాకెట్లు అమ్ముడుపోయాయని, సన్న వరి విత్తనాలు 13.33 లక్షల క్వింటాళ్లు విత్తనాలు అందుబాటులో వున్నాయని అలాగే 1,140,22 కోట్ల రూపాయల సబ్సిడీతో, 20,518.40 క్వింటాళ్ల జనుము, జీలుగు విత్తనాలు రైతుల కొనుగోలు చేశారని మంత్రి చెప్పారు. కానీ, మంత్రి ప్రకటనలోనే రైతులకు అవసరమైన విత్తనాలకు, అందుబాటులో వుంచిన విత్తనాలకు అంతరం వుంది. అది కూడా ప్రధానమైన వరి, పత్తి, పప్పుధాన్యాల విత్తనాలకు సబ్సిడీ లేదు. గత ప్రభుత్వ వలెనే సబ్సిడీ ఎత్తివేయటం నేటి ప్రభుత్వానికి తగింది కాదు కొనసాగించాలి. రైతును ఆదుకోవాలి. ఒక్క పచ్చి రొట్ట విత్తనాలకే సబ్సిడీ ఇవ్వటం మంచి విషయమేగానీ, పెద్ద ఉపయోగం వుండదు. అన్ని రకాల విత్తనాలకు సబ్సిడీ ఇచ్చి, అవసరమైనన్ని విత్తనాలు ప్రభుత్వమే సరఫరా చేయాలి. దీనివల్ల నకిలీ విత్తనాలు అరికట్టబడి, రైతుకు భారం తగ్గుతుంది. ఇలా చేయకపోతే, గత రైతు వ్యతిరేక కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వానికి, మాది రైతు ప్రభుత్వం అని చెప్పుకొనే రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి తేడా వుండదని పరిస్థితి మంచిది కాదు. అలాగే రుణాల, పురుగు మందుల సమస్య పరిష్కరించాలి. రుణ సమస్య – సాగు పెట్టుబడులకు సంబంధించి బ్యాంకులు రుణం ఇవ్వడం లేదు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిబంధనలకు విరుద్ధంగా అరకొరగా అందిస్తున్నది. తెలుగు రాష్ట్రాల్లో కేవలం 50% మంది రైతులకే బ్యాంకులు అరకొరగా రుణ సౌకర్యం కల్పిస్తున్నది. మిగిలిన 50% మంది రైతులు ప్రైవేటు వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేస్తున్నారు. 20 నుండి 35% వడ్డీలకు ప్రైవేటు వ్యాపారులే రైతులకు దిక్కవుతున్నారు. దీంతో పంటలు దెబ్బతిన్న రైతులు అధిక వడ్డీలతో పెరిగిపోయిన ప్రైవేటు అప్పులను తీర్చలేక పోతున్నారు. రుణమాఫీ కాక పోవడంతో అన్నదాతలకు అప్పుల భారం పెరిగిపోతున్నది. వాయిదా మీరిన బకాయిలు వున్నాయనే పేరుతో రైతులకు కొత్త అప్పులివ్వటం లేదు. లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేస్తామని గత కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం హామీ ఇవ్వటంతో రైతులు వాటిని చెల్లించలేదు. రుణమాఫీ 5 ఏండ్లు అయినా పూర్తి స్థాయిలో అమలు కాలేదు. ఈ విధంగా రాష్ట్ర వ్యాపితంగా దాదాపు 34 లక్షల మంది రైతుల పంట రుణాలు ఏండు తరబడి వాయిదా మీరిన బకాయిలుగా మిగిలి పోయాయి. నేటి కాంగ్రెసు ప్రభుత్వం ఏటా 2 లక్షల రుణమాఫీ చేస్తానని ప్రకటించింది. కానీ, అందుకు తగిన చర్యలు లేదు. చేపట్టాలి. రైతును ఆదుకోవాలి. ఎరువులు, వ్యవసాయ పరికరాలు సైతం పేద, మధ్యతరగతి రైతాంగానికి ఉచితంగాగానీ, సబ్సిడీతోగాని అవసరమైనన్ని అందించాలి. నకిల విత్తన వ్యాపారులపై చర్య తీసుకోవాలి. అలాగే, కనీస మద్దతు ధరల సమస్య కూడా చాలా ముఖ్యమైనది. కనుక, రైతులు పంటలపై పెడుతున్న సాగు ఖర్చులను స్వామినాథన్ కమీషన్ చెప్పినట్లు సమగ్రంగా అంచనా వేసి ఖర్చుల మీద 50% అదనంగా కలిపి నిర్ణయించాలి. ప్రభుత్వం కొనుగోలు చేయాలి. అందుకు ఒక చట్టం అవసరమనే విషయంలో రైతులు పక్షాన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో పోరాడాలి లేదా రాష్ట్ర ప్రభుత్వమైనా ఒక్క సన్న వడ్లకేగాక, అన్ని పంటలకు సబ్సిడీ ఇవ్వాలి. లేకపోతే, రైతుల గురించి ఎంత మాట్లాడినా ఫలితం వుండదు. రైతు ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని అర్థం చేసుకోవాలి.

# ఇక్కడ బిల్లు కట్టు... అక్కడ సిమెంట్ బస్తా పట్టు..

**తెల్ల పేపర్లపై బిల్లు.. జిఎస్టికి చిల్లు..**

**సారపాక ప్రాంతంలో జిఎస్టి దొంగలు.**

**జీఎస్టీ ఎగవేతకు దొంగ తెలివితేటలు..**

**తిమ్మిని బమ్మిని చేస్తూ.. ప్రజలను, ప్రభుత్వాన్ని మోసం చేస్తూ**




*బూర్గంపహాడ్, జూన్ 30, ప్రజాజ్యోతి:* బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక పరిసర ప్రాంతాల్లో కొందరు సిమెంటు, ఐరన్ వ్యాపారులు తెల్ల పేపర్లపై బిల్లును ఇస్తూ జిఎస్టి ఎగవేతకు పూనుకుంటున్నారని పలువురు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. జీఎస్టీ ఎగవేతకు దొంగ తెలివితేటలు ఉపయోగిస్తూ సారపాక పట్టణంలోని ఒక ఐరన్ షాప్ యజమాని ప్రజలను మోసం చేస్తూ... అధికారుల కళ్ళు కప్పి తన అక్రమ వ్యాపారాన్ని దర్జాగా కొనసాగించుకుంటున్నారని విమర్శలు వెలువవుతున్నాయి. అంతేకాక నాట్ ఫర్ సేల్ సిమెంట్ బస్తాలను సైతం దర్జాగా అమ్ము కుంటూ సొమ్ము చేసుకుంటున్నారు అంటే దీని అక్రమ దందా ఏ రీతిలో కొనసాగుతుందో అర్థం చేసు కోవచ్చు. దొంగలు దొంగలు ఊర్లను పంచుకుంటున్నారు అన్నది పాత సామెత అయితే... అదే సామెతను సారపాకలోని కొందరు వ్యాపారస్తులు ప్రస్తుతం ఆచరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ బిల్లు కట్టు. అక్కడ సిమెంట్ బస్తా పట్టు. అంటూ తమకు సంబంధం లేని బ్రాండ్ సిమెంటును సైతం విక్రయించేందుకు తహతలాడుతున్న ఆ వ్యాపారాలకు ఇతర బ్రాండ్ సిమెంట్ పై దొడ్డి దారిన వచ్చే లాభాలపై ఏ స్థాయిలో కక్కుర్తి పడుతున్నారో అర్థమవుతుంది. ఇకనైనా సంబంధిత శాఖ అధికారులు జీఎస్టీ ఎగవేతకు పూనుకొని ప్రభుత్వాన్ని, ప్రజలను మోసం చేస్తున్న జీఎస్టీ దొంగలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# ఘనంగా కల్లూరి నీలమ్మ సన్మాన ఉత్సవ కార్యక్రమం



*భద్రాచలం, 30 జూన్, ప్రజాజ్యోతి:* గిరిజన విద్యార్థినీ విద్యార్థులను కన్నబిడ్డల్లాగా చూసుకుని కంటికి రెప్పలా కాపాడుకుంటూ కామాటిగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందడం ప్రతి ఉద్యోగికి తప్పదని ఉద్యోగం చేసినన్ని రోజులు అధికారుల చేత ప్రశంసలు పొందినప్పుడే చేసిన ఉద్యోగానికి సార్ధకత లభిస్తుందని భద్రాచలం ఏ టి డి ఓ నరసింహారావు అన్నారు. ఆదివారం నాడు దుమ్ముగూడెం మండలంలోని మంగువాయి బడవ బాలికల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో కామాటిగా విధులు నిర్వహించి ఈరోజు ఉద్యోగ పదవి విరమణ పొందుతున్న కల్లూరి నీలమ్మ సన్మాన ఉత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 మార్చ్ 1998వ సంవత్సరంలో కుక్ పోస్టులో కిన్నెరసాని లో ఆమె ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమైందని, అనంతరం ఏ జి హెచ్ ఎస్ రేగుబల్లి అలాగే మంగువాయి బడవ ఆశ్రమ పాఠశాలలో కామాటీగా విధులు నిర్వహించి ఈరోజు ఉద్యోగ పదవీ విరమణ పొందడం బాధాకరమని అన్నారు. స్వతగా నీలమ్మ దానకర్ణురాలని, గిరిజన విద్యార్థినీ విద్యార్థుల విద్యాభివృద్ధి కొరకు మంగువాయి బడవలో పాఠశాల నిర్మాణం కొరకు ఎకరం స్థలాన్ని దానం చేసి గిరిజన విద్యార్థుల సంక్షేమం కొరకు కృషిచేసిందని అన్నారు. ఆమె ఎక్కడ పని చేసిన ఎవరితోటి మాట పడలేదని, పిల్లలను తన పిల్లలుగా భావించి వారి ఆలనా పాలనా చూసుకుందని, అటువంటి వ్యక్తి ఉద్యోగ విరమణ పొందడం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, బాధాకరమైన ఉద్యోగం అనేది ప్రతి ఒక్కరికి శాశ్వతం కాదని, తప్పనిసరిగా రిటర్మెంట్ తప్పదని తన శేష జీవితాన్ని తన కుటుంబ సభ్యులతో ఆనందంగా ఆయురారోగ్య ఐశ్వర్యాలతో గడపాలని ,ఆమె ఉద్యోగానికి రిటర్మెంట్ తీసుకుందని పాఠశాలల్లో ఆమె యొక్క సేవలు తప్పకుండా వినియోగించుకుంటామని ఆయన అన్నారు. అనంతరం కామాటీగా ఉద్యోగ పదవీ విరమణ పొందుతున్న నీలమ్మ మాట్లాడుతూ 25 మార్చ్ 1998వ సంవత్సరంలో పాల్వంచ మండలం కిన్నెరసాని లో తన ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమైందని, అప్పటినుండి గిరిజన విద్యార్థిని విద్యార్థులకు ఒక తల్లిగా సేవ చేసుకుంటూ ఉండే దానినని, అధికారులు నా ప్రవర్తనను మెచ్చి నాకు దుమ్ముగూడెం మండలం రేగుభల్లి ,మంగ వాయి బడువాకు బదిలీ చేయడం జరిగిందని, పిల్లల యొక్క విద్యాభివృద్ధి కొరకు నాకు ఉన్న పొలంలో ఒక ఎకరాన్ని ఆశ్రమం పాఠశాల నిర్మాణానికి ఇవ్వడం జరిగిందని, ఇప్పుడు అదే స్థలములో ఈ పాఠశాల నిర్మాణం జరిగిందని అన్నారు. 26 సంవత్సరాల సర్వీసులో నాకు సహకరించిన హెచ్ఎం లకు, వార్డెన్లకు మరియు ఉపాధ్యాయులకు, గిరిజన విద్యార్థిని విద్యార్థులకు, నా తోటి సిబ్బందికి అందరికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని, నా శరీరంలో సత్తువ ఉన్నంతవరకు గిరిజన విద్యార్థినీ విద్యార్థుల సంక్షేమం కొరకు నా యొక్క సహాయ సహకారాలు అందిస్తానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో గురుకులం ఏవో కృష్ణార్జున, హెచ్ఎం వీర కుమారి, సర్వేశ్వర దొర, నారాయణ, రంగయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందుతున్న నీలమ్మకు పాఠశాల హెచ్ఎం మరియు డిడి ట్రైబల్ వెల్ఫేర్ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

# విద్యార్థులకు నోటు బుక్స్, స్టేషనరీ పంపిణీ



*కొత్తగూడెం, జూన్ 30, ప్రజాజ్యోతి:* కొత్తగూడెం మన్సిపల్ పరిధి లోని రామవరం 12వ వార్డు (సి. ఆర్. పి క్యాంప్ )లో శ్రీరాములు రాయమల్లు చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు శ్రీరాముల విశ్వనాథ్ లక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం నాడు సుమారు 100మంది స్కూల్ విద్యార్థు లకు నోట్బుక్స్, విద్యార్థులకు ఉపయో గపడే స్టేషనరీ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రిన్సిపాల్ రాయలింగు, బండి భాస్కర్, అనుదీప్ మాట్లాడుతూ అన్ని దానాల కన్నా విద్యాదానం గొప్పదని ఈనాటి బాలలే రేపటి తరం పౌరులని నోట్ పుస్తకాలు అందుకున్న విద్యా ర్థులు బాగా చదువుకుని తల్లిదం డ్రులకు, సమాజానికి మంచి పేరు తేవాలని రాబోయే తరాలకు సేవ చేయాలని విశ్వనాథ్ దంపతులు కోరారు. శ్రీరాముల రాయమల్లు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపయోగపడే ఇంత మంచి కార్యక్రమం నిర్వహించడం ఎంతో గొప్ప విషయమని చార్టబుల్ ట్రస్ట్ సేవలు ఇదే విధంగా సమాజం లో అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగ పడేలా యువత సాగాలని ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే అన్ని కార్య క్రమంలో భాగస్వామ్యం అవుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మిత్రులు జెల్లి శ్రీను, ఉమాకాంత్ గంట, ట్రస్ట్ సభ్యులు వెంకట్ మద్రి కృష్ణ, సంపత్, డేవిడ్, మెల్లం పురుషోత్తం, వేణు, రమేష్, సిరి రాందేవ్, వీరు, రామకృష్ణ,కత్తి శ్రీను, కృష్ణ వార్డు పెద్దలు పాల్గొన్నారు.

# హ్యాట్సాఫ్ టీం ఇండియా

**– ప్రపంచకప్ విజేత భారత జట్టుకు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అభినందనలు**



*భద్రాచలం, జూన్ 30, ప్రజాజ్యోతి:* టీ ట్వంటీ క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్లో దక్షిణాఫ్రికా పై భారత జట్టు ఘన విజయం సాధించడం పట్ల భద్రాచలం నియోజకవర్గం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు హర్షం వ్యక్తం చేశారు. 17 ఏళ్ల నిరీక్షణ తరువాత టీ ట్వంటీ వరల్డ్ కప్ లో భారత్ విజయం తనకు సంతోషాన్ని కలిగించిందని తెలిపారు. ఈ సందర్భంగా కెప్టెన్ రోహిత్ బృందానికి అభినందనలు తెలిపారు. టీం ఇండియా ప్రపంచ కప్ గెలవడం పట్ల దేశ ప్రజలకు , క్రికెట్ అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయం రేపటి భవిష్యత్ క్రీడాకారులను మరింత ప్రోత్సహించడానికి ఉపయోగపడుతుందని ఆకాక్షించారు.

# నూతన లక్ష్మీదేవి ఆలయ నిర్మాణం





*దుమ్ముగూడెం, జూన్ 30, ప్రజా జ్యోతి* దుమ్ముగూడెం మండలం, కాశీనగరం గ్రామములో పంట చేలలో వెలసిన లక్ష్మి దేవి రాతి శిలా విగ్రహం, సప్తమాత్రకలలో ఒక రూపం అంటే ఏడుగురు గ్రామ దేవత రూపాలలో ఉన్న ఈ స్వయం భూమాత లక్ష్మి దేవి ప్రతిమ కు ఈరోజు ఆది వారం గ్రామ దేవతగా భావించిన కాశీనగరం గ్రామస్తులు లక్ష్మీదేవికి నూతనంగా ఆలయం నిర్మించి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు హెూమాధి కార్యక్రమాలు నిర్వహించినారు, ఇలాంటి కార్యక్రమం వలన గ్రామమంతా సుభిక్షంగా సమృద్ధిగా వర్షాలు పడి పాడిపంటలు ధన ధాన్య వృద్ధి కలుగుతాయని వేద పండితులు రాఘవ శర్మ తెలియచేసి, పూజ కార్యక్రమాలు గ్రామ పెద్దలు సర్పంచి కనక దుర్గా తదితర కాశీనగరం గ్రామ మహిళలు, పిల్లలు అందరి సమక్షం లో కుంకుమ పూజలు, అమ్మవారి యొక్క పసుపు, కుంకుమ, గాజులు, పంపిణీ చేశారు, ఈ పూజ కార్యక్రమం లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు, సాయంత్రం అమ్మవారి ప్రభమ కు 101బింది నీళ్లతో స్నానం చేయించి గ్రామం పుర వీధుల్లో మేళ తాళాలతో, ఊరేగింపు నిర్వహించారు.

# ముగిసిన అంగనవాడిల శిక్షణ తరగతులు



*బూర్గంపహాడ్, జూన్ 30, ప్రజాజ్యోతి:* అంగన్వాడీ టీచర్లకు మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం తాళ్ల గోమ్మూరులో ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సిడిపిఓ ప్రమీల పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు నుండి ఆరు సంవత్సరాల చిన్నారులకు బోధించే అంశాల గురించి ఆటపాటలతో విద్య మానసిక ఎదుగుదల సామర్థ్యం గురించి టీచర్లకు శిక్షణ ఇవ్వడం జరిగిందని అన్నారు. తొలిరోజు శిక్షణకు 35 మంది అంగన్వాడీ టీచర్లు హాజరైనారు ఈ శిక్షణ ద్వారా ప్రతి అంగన్వాడీ టీచర్ కు చిన్నారులకు ఏ విధంగా శిక్షణ ఇవ్వాలో తెలుసుకోవడం నేర్చుకున్నారని తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయుటకు ఈ శిక్షణ ఉపయోగ పడుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, ఎన్జీవో సంస్థ ప్రతినిధులు ,అంగన్వాడి టీచర్లు సిబ్బంది పాల్గొన్నారు.